జిల్లా ప్రజలకు ఎస్పీ అజిత వెజెండ్ల
దసరా శుభాకాంక్షలు







RNI: APTEL/26/A8235

# అక్షర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక



అక్షర దర్శిని

దినపత్రికలో పని చేయడానికి అనుభవం కలిగిన, జర్నలిజంపై ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను. కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

9912808090
8374168090



నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -22 | మంగళవారం 20 అక్టోబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్నయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-




## ఎన్నికల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు

- సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

**అమరావతి,(అక్షర దర్శిని):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని జిల్లాల్లో తలెత్తిన సమస్యల నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, శాంతిభద్రతల ఏడీజీ ఎన్. మధుసూదనరెడ్డి, ఐజీ బి. రాజకుమారితో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా, డా. ఏ. మల్లికార్జున సమీక్ష నిర్వహించారు. రాబోయే ఎన్నికల దశల్లో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, సున్నిత, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును పునఃసమీక్షించి, అవసరమైన చోట అదనపు బలగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం వహించకుండా పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా జిల్లా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసుకునేలా, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎన్నికల కమిషనర్ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పాటిస్తూ, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.



## సర్వేపల్లి వైసీపీలోకి కొనసాగుతున్న వలసలు

### టీడీపీని వీడి వైసీపీలో చేరిన 30 కుటుంబాలు
### సోమిరెడ్డి తీరుతోనే పార్టీని వీడుతున్న నేతలు: కాకాణి

**2029లో జగన్‌ను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం**

నెల్లూరు,(అక్షర దర్శిని): సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం నెల్లూరులోని ఆయన నివాసంలో తోటపల్లిగూడూరు మండలం కొత్తకోడూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఊటుకూరు శ్రీనివాసులు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కైలాసం రాజాతో పాటు సుమారు 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైసీపీలో చేరాయి. కావల్‌రెడ్డి సోదరుల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి కాకాణి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యవహారశైలి నచ్చకనే టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడుతున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల దౌర్జన్యాలు, బెదిరింపులు పెరిగిపోయాయని ఆరోపించారు. ఏళ్ల తరబడి టీడీపీ కోసం పనిచేసిన నాయకులకు తగిన గౌరవం దక్కడం లేదని, అందుకే వారంతా వైసీపీ వైపు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు.

### స్థానిక ఎన్నికల్లో వైసీపీ సత్తా చాటుతాం

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు వైసీపీలో చేరడం పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణకు నిదర్శనమని కాకాణి అన్నారు. ప్రజలను నమ్ముకుని ఎన్నికలకు వెళ్లే ధైర్యం టీడీపీకి లేదని విమర్శించారు. అధికారులను, పోలీసులను అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### సర్వేపల్లిలో వైసీపీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతాం

అధికార పార్టీ నుంచి ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా వైసీపీ నాయకులు, కార్యకర్తలు వెనక్కి తగ్గబోరని కాకాణి స్పష్టం చేశారు. పార్టీలో చేరుతున్న కొత్త నాయకులను, ఇప్పటికే ఉన్న నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీని తిరుగులేని రాజకీయ శక్తిగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న కొత్తకోడూరు వైసీపీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ధనలక్ష్మి అలంకారంలో ఆదిలక్ష్మి అమ్మవారు










# జిల్లా ప్రగతి.. రాష్ట్ర అభివృద్ధే ధ్యేయం

- విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి నారాయణ
- నెల్లూరును మోడల్ సిటీగా.. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతాం

**నెల్లూరు,(అక్షర దర్శిని):** రాష్ట్ర ప్రగతి, జిల్లా సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలతో పాటు నెల్లూరు జిల్లా వాసులకు ఆయన హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి పర్వదినాన అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజలందరూ పండుగను ఆనందోత్సాహాలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

**అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో అమరావతి రాజధానిని ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని నారాయణ తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తును సుసంపన్నం చేసే లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు.

**నెల్లూరు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం**

నెల్లూరు జిల్లా సమగ్రాభివృద్ధితో పాటు స్థానిక ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంతో పాటు, మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి నెల్లూరును ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. విజయదశమి స్ఫూర్తితో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ముందుకు సాగుతామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా మరోసారి రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని మంత్రి ఆకాంక్షించారు.

# సర్వేపల్లిలో వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు!





- కొమ్మలపూడిలో 51 కుటుంబాలు టీడీపీలో చేరిక
- మాజీ సర్పంచ్ బందెల వేణుగోపాల్ నాయకత్వంలో పార్టీ మారిన వైసీపీ శ్రేణులు

**నెల్లూరు,(అక్షర దర్శిని):** సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. తాజాగా మనుబోలు మండలం కొమ్మలపూడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బందెల వేణుగోపాల్ నాయకత్వంలో 51 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. నెల్లూరులోని అల్లీపురంలో ఉన్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నివాసంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. కొమ్మలపూడి నాయకుడు మన్నెమాల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ, కొమ్మలపూడిలో దాదాపు 90 శాతం మంది టీడీపీకి మద్దతుగా నిలవడం శుభపరిణామమని పేర్కొన్నారు. కొమ్మలపూడితో పాటు వరకవిపూడి వంటి గ్రామాల్లోనూ వైసీపీ బలహీనపడుతోందని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరుతున్నాయని, వారందరికీ సాదర స్వాగతం పలుకుతున్నామని తెలిపారు.

**వైసీపీ పాలనలో భూదోపిడీ జరిగిందని ఆరోపణ**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని సోమిరెడ్డి అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సర్వేపల్లి నియోజకవర్గంలో పెద్దఎత్తున భూకబ్జాలు జరిగాయని ఆరోపించారు. కొమ్మలపూడిలో కోట్లాది రూపాయల విలువైన 19 ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ నాయకులు సొంతం చేసుకున్నారని విమర్శించారు. రామదాసుకండ్రిగలో ఎకరా సుమారు రూ.1.50 కోట్ల విలువ చేసే 57 ఎకరాల భూమిని ఎకరాకు రూ.15 లక్షల చొప్పున అల్లుడి పేరుతో తీసుకున్నారని ఆరోపించారు. మరుపూరులో ఆదాయపు పన్ను చెల్లించే సంపన్న కుటుంబానికి దాదాపు రూ.40 కోట్ల విలువైన 57 ఎకరాల భూమిని అప్పగించారని విమర్శించారు. వైసీపీ నాయకుల ఒత్తిళ్లకు అనుగుణంగా వ్యవహరించిన పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది సస్పెన్షన్‌కు గురయ్యారని పేర్కొన్నారు.

**పేద రైతులకు పట్టాలు ఇవ్వలేదని విమర్శ**

ఒకవైపు భూకుంభకోణాలకు పాల్పడ్డారని ఆరోపిస్తున్న వైసీపీ నాయకులు, మరోవైపు తోడేరులో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న 50 మంది బలహీనవర్గాల రైతులకు చెందిన 127 ఎకరాలకు పట్టాలు ఇవ్వలేదని సోమిరెడ్డి విమర్శించారు. తోడేరు గ్రామానికే పరిమితం కాకుండా సర్వేపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన పేదలకు పట్టాలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**నిలిచిపోయిన సాగునీటి పనులను పూర్తి చేస్తాం**

డేగపూడి--బండేపల్లి కాలువ పనుల కోసం తాను నిధులు సాధించి పనులు ప్రారంభించగా, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంట్రాక్టర్లను వెనక్కి పంపించి పనులను అడ్డుకున్నారని సోమిరెడ్డి ఆరోపించారు. పొదలకూరు మండలంలోని సోమశిల దక్షిణ కాలువ పనుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందడం, పేదలు సంతోషంగా జీవించడం వైసీపీ నాయకులకు ఇష్టం లేదని విమర్శించారు.

**ఐదు జెడ్పీటీసీలు, ఐదు ఎంపీపీ స్థానాలు గెలుస్తాం**

ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని ఐదు జెడ్పీటీసీ స్థానాలతో పాటు ఐదు ఎంపీపీ స్థానాలను కూటమి పార్టీలు కైవసం చేసుకోవడం ఖాయమని సోమిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమకు విజయాన్ని అందిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కొమ్మలపూడిలో 51 కుటుంబాల చేరికతో సర్వేపల్లి నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మరింత ఆసక్తికరంగా మారాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ చేరికలు టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపగా, ఎన్నికల ఫలితాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి

- రాష్ట్ర ప్రజలకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దసరా శుభాకాంక్షలు



**నెల్లూరు,(అక్షర దర్శిని):** చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి పర్వదినమని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. దుర్గామాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రజలతో పాటు నెల్లూరు జిల్లా, ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి పండుగ ధర్మం, న్యాయం, సత్యం, ప్రజాహితం ఎల్లప్పుడూ విజయం సాధిస్తాయనే సందేశాన్ని అందిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ పర్వదిన స్ఫూర్తితో విధ్వంసక రాజకీయాలకు స్వస్తి పలికి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పునర్నిర్మాణం, ప్రజా సంక్షేమం, సుపరిపాలన ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో, మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధి, గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు దేవాలయాల అభివృద్ధి, హిందూ ధర్మ పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని వివరించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా, ఆత్మకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు. దుర్గాదేవి కృపతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతులకు కష్టానికి తగిన ఫలితం లభించాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆకాంక్షించారు.

# కలువాయిలో టీడీపీ ఎన్నికల సమీక్ష

- స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలి
- ఉయ్యాలపల్లికి చెందిన 40 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక
- అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల వ్యూహాలపై కురుగొండ్ల రామకృష్ణ దిశానిర్దేశం



**కలువాయి,(అక్షర దర్శిని):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లా కలువాయి మండల కేంద్రంలోని ఉమామహేశ్వర కల్యాణ మండపంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కూటమి నేతలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఉయ్యాలపల్లి గ్రామానికి చెందిన 40 వైసీపీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కలువాయి మండలంలోని అన్ని ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసేలా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి పార్టీల నాయకులు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని, అభ్యర్థుల గెలుపు కోసం సమన్వయంతో పనిచేయాలని కోరారు. మండలంలోని మొత్తం 12 ఎంపీటీసీ సెగ్మెంట్లకు గాను ఇప్పటికే 10 స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేశామని, మిగిలిన రెండు స్థానాల అభ్యర్థులను కూడా రేపటిలోగా ప్రకటిస్తామని వెల్లడించారు.



**ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి**

తెలుగుదేశం పార్టీకి దౌర్జన్యాలు చేసే సంస్కృతి లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ప్రజల మద్దతుతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించే దిశగా పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో కలువాయి మండల టీడీపీ అధ్యక్షుడు చల్లా రఘురామ్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, సోమయ్య యాదవ్ నాయుడు, రాపూరు మార్కెటింగ్ వైస్ చైర్మన్ గడ్డం కిషోర్ రెడ్డి, వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

- పోలింగ్ సిబ్బందికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేశవర్ధన్ రెడ్డి, డీఈఓ బాలాజీరావు దిశానిర్దేశం
- బ్యాలెట్ పేపర్ల నిర్వహణపై పూర్తి అవగాహన అవసరం
- విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవు





**నెల్లూరు,(అక్షర దర్శిని):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బంది నిబంధనలపై పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేశవర్ధన్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీరావు సూచించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సోమవారం నెల్లూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాశాలలో ప్రిసైడింగ్ అధికారులు (పీవోలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవోలు), ఇతర పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని ఎన్నికల విధులపై పలు సూచనలు చేశారు.

**బ్యాలెట్ పేపర్ల నిర్వహణలో అప్రమత్తత అవసరం**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ల ద్వారా పోలింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేశవర్ధన్ రెడ్డి సూచించారు. బ్యాలెట్ పేపర్ల పంపిణీ, ఓటర్లు వాటిని సక్రమంగా మడతపెట్టి బ్యాలెట్ బాక్సుల్లో వేయడం, పోలింగ్ ముగిసిన అనంతరం బాక్సులను సీల్ చేయడం వంటి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారిదే కీలక బాధ్యత అని, తన బృందంలోని ఇతర అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన స్టాట్యుటరీ, నాన్‌స్టాట్యుటరీ సామగ్రి నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని స్పష్టం చేశారు.

**ఓటింగ్ గోప్యతకు భంగం కలగకూడదు**

ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించాలని, అయితే ఓటింగ్ గోప్యతకు ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఓటర్లు స్వేచ్ఛగా, గోప్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అనుమతించిన రాజకీయ పార్టీల ఏజెంట్లను మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు తలెత్తితే నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించిన పీవో హ్యాండ్‌బుక్ సాఫ్ట్ కాపీలు, ఇతర శిక్షణ సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు కేశవర్ధన్ రెడ్డి తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో రూపొందించిన ఆరు నిమిషాల అవగాహన వీడియోను సైతం అధికారిక గ్రూపుల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సామగ్రిని అధ్యయనం చేయడంతో పాటు నమూనా ఫారాల భర్తీపై సాధన చేయాలని, సందేహాలను ముందుగానే నివృత్తి చేసుకోవాలని సూచించారు.

**విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు**

ఎన్నికల విధులను ప్రతి ఉద్యోగి బాధ్యతగా భావించి తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీరావు స్పష్టం చేశారు. విధులకు గైర్హాజరైతే సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ నెల 24వ తేదీన రిటర్నింగ్ అధికారి (ఆర్వో) స్థాయిలో తదుపరి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ సమయంలో పోలింగ్ కేంద్రాల వారీగా ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందితో కూడిన బృందాల కేటాయింపు ఖరారవుతుందని వివరించారు. పీవోలకు హ్యాండ్‌బుక్‌లను అందజేయడంతో పాటువాటిసాఫ్ట్‌కాపీలనుకూడాఅందుబాటులోఉంచుతామని పేర్కొన్నారు.

**పోలింగ్‌కు ముందే పూర్తి అవగాహన పెంపొందించుకోవాలి**

ఈ నెల 28వ తేదీన పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది హ్యాండ్‌బుక్‌ను పూర్తిగా చదివి, పోలింగ్ నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంపై అవగాహన పెంపొందించుకోవాలని బాలాజీరావు సూచించారు. విధుల నిర్వహణలో తలెత్తే సందేహాలను ఈ నెల 24న జరిగే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య 1,000కు మించి ఉండే అవకాశం ఉన్నందున పోలింగ్ ప్రక్రియకు ఎక్కువ సమయం పట్టవచ్చని పేర్కొన్నారు. అందువల్ల సిబ్బంది సమయపాలన పాటిస్తూ, పరస్పర సమన్వయంతో విధులు నిర్వహించాలని కోరారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించి జిల్లా యంత్రాంగానికి మంచి పేరు తీసుకురావాలని అధికారులు ఎన్నికల సిబ్బందికి సూచించారు.

# స్థానిక ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు



- ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలి: కలెక్టర్ హిమాన్షు శుక్ల
- ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి: పరిశీలకురాలు సదా భార్గవి
- బందోబస్తు విధుల్లో సుమారు 4,000 మంది పోలీసులు: ఎస్పీ అజిత వేజెండ్ల

**నెల్లూరు,(అక్షర దర్శిని):** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహిం చేం దుకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. సోమవారం అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, ఎస్పీలకు ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల, జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ సదా భార్గవి కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాలులో నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

**పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉండాలని తెలిపారు. మున్సిపాలిటీలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తయిందని, ఈ నెల 28న జరగనున్న పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నామని వెల్లడించారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీటీసీ స్థానాలకు సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో, జెడ్పీటీసీ స్థానాలకు జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారుజిల్లాలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీసు బందోబస్తుతో పాటు అత్యంత సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ సదుపాయాన్ని కల్పించినట్లు వివరించారు. పోస్టల్ బ్యాలెట్ల కోసం ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పోలింగ్ సామగ్రి తరలింపు, మైక్రో అబ్జర్వర్ల నియామకం, ఎన్నికల సిబ్బందికి శిక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

**ఎన్నికల నియమావళి అమలులో నిర్లక్ష్యం వద్దు**

జిల్లా ఎన్నికల పరిశీలకురాలు సదా భార్గవి మాట్లాడుతూ, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను అధికారులు పూర్తి బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సిబ్బందితో పాటు మైక్రో అబ్జర్వర్లకు అవసరమైన శిక్షణ అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని, ఎక్కడా ఉల్లంఘనలు జరగకుండా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన ఎంసీసీ, ఎంసీఎంసీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు సమన్వయంతో పనిచేస్తూ తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.

**ఎన్నికల బందోబస్తుకు 4,000 మంది పోలీసులు**

జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణ, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బృందాలను మోహరించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల విధుల కోసం సుమారు 4,000 మంది పోలీసు సిబ్బందిని వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు భద్రతా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్‌తో పాటు వివిధ శాఖల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# టీడీపీ నేతల ఉడత బెదిరింపులకు భయపడం:కాకాణి

- షేక్ సిద్ధిఖీ నామినేషన్ తిరస్కరణపై కాకాణి ఆగ్రహం



**నెల్లూరు,(అక్షర దర్శిని):** టీడీపీ నాయకుల బెదిరింపులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భయపడబోదని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరు నగరంలోని 63వ డివిజన్ నుంచి పోటీ చేస్తున్న వైసీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ సిద్ధిఖీ నామినేషన్ తిరస్కరణను నిరసిస్తూ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో కలిసి నామినేషన్ కేంద్రం వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ, అధికార పార్టీ ఒత్తిళ్లతోనే రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను తిరస్కరిస్తున్నారని ఆరోపించారు. షేక్ సిద్ధిఖీ తనపై ఉన్న కేసుల వివరాలను వెల్లడించి పోలీసుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకున్నప్పటికీ, అఫిడవిట్‌లో వివరాలు పూర్తిగా లేవనే కారణంతో నామినేషన్‌ను తిరస్కరించారని విమర్శించారు. తిరస్కరణకు సంబంధించిన కారణాలను రాతపూర్వకంగా ఇవ్వాలని కోరినా అధికారులు స్పందించలేదని ఆరోపించారు. పోలీసులు, అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా కాకుండా నిబంధనల ప్రకారం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని, నామినేషన్ల తిరస్కరణపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష అభ్యర్థులను పోటీ నుంచి తప్పించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. నెల్లూరు నగర ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచి మేయర్ అభ్యర్థి ఆనం విజయకుమార్ రెడ్డితో పాటు పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని కాకాణి విజ్ఞప్తి చేశారు.



## ఏపీ హెచ్ఆర్‌సీ ఛైర్మన్‌ను కలిసిన పల్లెటి వెంకటేష్ నాయుడు..

- నూతన హెచ్ఆర్సీ ఛైర్మన్ సత్యనారాయణమూర్తి కి అభినందనలు...
- బాధితులకు సత్వర న్యాయం అందాలని ఆకాంక్ష!

**నెల్లూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు జిల్లా సైదాపురం మండలం కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన పల్లెటి వెంకటేష్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా నియమితులైన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మల్లావోలు సత్యనారాయణమూర్తిని విజయవాడలోని ఆయన స్వగృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి హోదాతో సమానమైన బాధ్యతలు కలిగిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న జస్టిస్ సత్యనారాయణమూర్తికి పల్లెటి వెంకటేష్ నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన బాధ్యతల్లో వారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజలకు, బాధితులకు న్యాయం అందించడంలో విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు. మానవ హక్కుల పరిరక్షణలో కమిషన్ మరింత సమర్థవంతంగా పనిచేస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. న్యాయ వ్యవస్థలో ఉన్న అపారమైన అనుభవంతో జస్టిస్ సత్యనారాయణమూర్తి ప్రజలకు విశేష సేవలు అందిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అలాగే తమ కుటుంబ సన్నిహితులైన జస్టిస్ సత్యనారాయణమూర్తిని కలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని పల్లెటి వెంకటేష్ నాయుడు పేర్కొన్నారు.

## పొదలకూరు-2 వైసీపీ అభ్యర్థిగా వాకాటి సంధ్య

- అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



**పొదలకూరు,(అక్షర దర్శిని):** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొదలకూరు-2 ప్రాదేశిక స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వాకాటి సంధ్యను మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రకటించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పొదలకూరు-2 స్థానంలో వాకాటి సంధ్య విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారం, స్థానిక అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రజల మద్దతుతో ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తామని వాకాటి సంధ్య తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి వేడుకలు

- దుర్గమ్మ మాలధారుల ప్రత్యేక పూజలు

**పొదలకూరు,(అక్షర దర్శిని):** మండలంలోని శివాలయంలో తొమ్మిది రోజులపాటు నిర్వహించిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా ముగిశాయి. తొలిసారిగా భక్తులు దుర్గమ్మ మాలలు ధరించి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఆలయ అర్చకులు ప్రసాద్ స్వామి, రమేష్ స్వామి, కుమార్ స్వామి ఆధ్వర్యంలో వినాయకుడు, శివయ్య, అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. దుర్గమ్మ మాలధారులు ప్రత్యేక హోమ పూజలు నిర్వహించి, ఇరుముడులు కట్టుకున్నారు. అనంతరం విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనానికి భక్తి శ్రద్ధలతో బయలుదేరారు. ఈ సందర్భంగా అయ్యప్ప, దుర్గమ్మ మాలధారులతో పాటు ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు జరిగిన శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.



## ధనలక్ష్మి అలంకారంలో ఆదిలక్ష్మి అమ్మవారు

▸▸ వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు.. భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన క్షేత్రం



**పెంచలకోన,(అక్షర దర్శిని):** నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో కొలువై ఉన్న శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారి పట్టమహిషి ఆదిలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొమ్మిదో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి, స్నపన తిరు మంజనం నిర్వహించారు. సాయంత్రం వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించారు. అనంతరం ఆదిలక్ష్మి అమ్మవారిని ధనలక్ష్మి అలంకారంలో పద్మపీఠంపై ఆశీ నులను చేసి ప్రాకారోత్సవం నిర్వహించారు. తదుపరి సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో చేపట్టారు. ప్రధానార్చకులు, అర్చకులు, వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ధనలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని చూసి భక్తులు పరవశించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పెంచలకోన క్షేత్రంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మవారి కృపాకటాక్షాలు తమపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.

## పెంచలకోన ఆలయానికి రూ.2 లక్షల విరాళం

▸▸ నిత్యాన్నదాన పథకానికి రూ. 1లక్ష



▸▸ ఆదిలక్ష్మి ఆలయ పునర్నిర్మాణానికి రూ. 1లక్ష

**పెంచలకోన,(అక్షర దర్శిని):** నెల్లూరు జిల్లా పెంచలకోన క్షేత్రంలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయానికి సోమవారం రూ.2 లక్షల విరాళం అందింది. మర్రిపాడు మండలం భీమవరం గ్రామానికి చెందిన మూలి మాధవరెడ్డి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,000 విరాళంగా అందజేశారు. అలాగే ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి మరో రూ.1,00,000 నగదును విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయ సీనియర్ అసిస్టెంట్ నరసింహయ్య, అన్నదాన విభాగానికి చెందిన వెంకట సుబ్బయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా దాత మూలి మాధవరెడ్డికి ఆలయ అధికారులు శ్రీవారి దర్శనం కల్పించి, శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. ఆలయ నిత్యాన్నదాన పథకానికి, అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు అందించడం పట్ల ఆలయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. భక్తులు, దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు మరింత ముందుకు సాగుతాయని పేర్కొన్నారు.

## జిల్లా ప్రజలకు ఎస్పీ అజిత వెజెండ్ల దసరా శుభాకాంక్షలు

▸▸ ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి



**నెల్లూరు,(అక్షర దర్శిని):** చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎస్పీ డా. అజిత వెజెండ్ల జిల్లా ప్రజలకు హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో పాటు ప్రజలు, మీడియా మిత్రులందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సమృద్ధిని నింపాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం ఆనందంగా, ఆరోగ్యంగా, సురక్షితంగా ఉండాలని, విజయదశమి అందించే స్ఫూర్తితో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఎస్పీ ఆకాంక్షించారు. పండుగ వేళ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఆశలు, విజయాలు తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు.

# వీపీఆర్ దంపతుల నాయకత్వంపై నమ్మకం





▸▸ టీడీపీలో చేరిన పడుగుపాడు వైసీపీ కుటుంబాలు

▸▸ వైసీపీని వీడి టీడీపీలో చేరిన 60 కుటుంబాలు

▸▸ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో చేరికలు

**నెల్లూరు,(అక్షర దర్శిని):** కోవూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి మద్దతు పెరుగుతోందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కోవూరు మండలం పడుగుపాడుకు చెందిన 60 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. నెల్లూరులోని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు నూతనంగా పార్టీలో చేరిన వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పెంచలయ్య ఆధ్వర్యంలో పడుగుపాడుకు చెందిన విన్నకోట వాసు, విన్నకోట శ్రీనివాసులునాయుడు, విన్నకోట వెంకట రమణయ్య, విన్నకోట వెంకటేశ్వర్లు, విన్నకోట జగదీశ్, విన్నకోట రాహుల్, విన్నకోట భాను, బొచ్చు చంద్రమౌళి, దాసరి శశికుమార్ తదితరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వీపీఆర్ దంపతులు మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. టీడీపీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకత్వంపై నమ్మకంతోనే పార్టీలో చేరినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వీపీఆర్ దంపతుల మార్గదర్శకత్వంలో పనిచేస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి తమ వంతు కృషి చేస్తామని వెల్లడించారు.

## టీడీపీలో చేరిన మలిశెట్టి శివశంకర్..

▸▸ పొదలకూరు బిట్-2 ఎంపీటీసీ అభ్యర్థిగా ఖరారు

▸▸ బలిజ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తున్నాం:

▸▸ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి




**పొదలకూరు,(అక్షర దర్శిని):** పొదలకూరుకు చెందిన మలిశెట్టి శివశంకర్ (పీఆర్పీ) తన అనుచరులతో కలిసి సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో శివశంకర్‌తో పాటు ఆయన అనుచరులకు ఎమ్మెల్యే పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పొదలకూరు బిట్-2 ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మలిశెట్టి శివశంకర్ పేరును సోమిరెడ్డి అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ బలిజ, కాపు సామాజిక వర్గాలకు తెలుగుదేశం పార్టీ సముచిత రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తోందని తెలిపారు. గతంలో పొదలకూరులో ఈ సామాజిక వర్గానికి రాజకీయంగా తగిన ప్రాధాన్యత లభించలేదని, తమ పార్టీ గుర్తించి ఎంపీటీసీ స్థానాన్ని కేటాయించిందని పేర్కొన్నారు. పార్టీలోని పాత, కొత్త నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని, అందరూ కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, రావూరి సుధీర్ నాయుడు, దామినేని బుజ్జయ్య నాయుడు, పులిపాటి వెంకటరత్నం నాయుడు పాల్గొన్నారు.

## నామినేషన్ల పరిశీలన కేంద్రానికి కాకాణి,పర్వతరెడ్డి

▸▸ నెల్లూరు పాత మున్సిపల్ కార్యాలయం వద్ద పరిస్థితిని పరిశీలించిన వైసీపీ నేతలు

**నెల్లూరు,(అక్షర దర్శిని):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నామినేషన్లను ఏకపక్షంగా తిరస్కరిస్తున్నారనే సమాచారం నేపథ్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఆగమేఘాల మీద నెల్లూరులోని పాత మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ జరుగుతున్న నామినేషన్ల పరిశీలన ప్రక్రియను, పరిస్థితులను వారు పరిశీలించారు. వైసీపీ అభ్యర్థుల నామినేషన్ల విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు రావడంతో పార్టీ ముఖ్య నేతలు నామినేషన్ పరిశీలన కేంద్రానికి చేరుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అక్కడి పరిస్థితులను పరిశీలించిన వారు నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ క్రమంలో వైసీపీ నేతల రాకతో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద రాజకీయంగా ఆసక్తికర పరిస్థితి నెలకొంది.



# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

▸▸ పొదలకూరు జడ్పీటీసీగా బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి(చిన్ని)ని గెలిపించాలి

▸▸ వైసీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మోపూరు శ్రీనివాసులురెడ్డి పిలుపు



**పొదలకూరు,(అక్షర దర్శిని):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేసి విజయాన్ని సాధించాలని మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, వైసీపీ నాయకుడు మోపూరు శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. పొదలకూరు జడ్పీటీసీ అభ్యర్థి బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డిని గెలిపించి పార్టీ నాయకత్వానికి విజయాన్ని కానుకగా అందించాలని కోరారు. మండలంలోని మరుపూరులో వేణంభాక చంద్రశేఖర్‌రెడ్డి నివాసంలో సోమవారం వైసీపీ నాయకులు, కార్యకర్తలతో స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ విజయానికి చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులు దిశానిర్దేశం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్నాయని తాము ఆరోపిస్తున్న అక్రమాలు, ప్రకృతి వనరుల విధ్వంసం, తప్పుడు కేసులతో వేధింపుల అంశాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త పార్టీ విజయమే లక్ష్యంగా సైనికుడిలా పనిచేయాలని నాయకులు సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలను కలుస్తూ పార్టీ విధానాలు, ప్రజా సమస్యలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగి పొదలకూరు జడ్పీటీసీతో పాటు ఎంపీపీ స్థానాన్ని కూడా కైవసం చేసుకునేందుకు కృషి చేయాలని చంద్రశేఖర్‌రెడ్డి, మోపూరు శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు.

Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.